క్లుప్తంగా

బదిలీపై వెళ్తున్న డీజీఎంకు సన్మానం



డీజీఎం అరవిందరావును సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో డీజీఎం (పర్సనల్)గా పనిచేసి ఆర్జీ 2 ఏరియాకు బదిలీపై వెళ్తున్న పీ.అరవిందరావును ఏరియా అధికారులు శనివారం కార్యాలయంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఏరియాలో ఆయన చేసిన సేవలను కొనియాడారు.

మంత్రి 'అడ్లూరి'ని కలిసిన తిరుపతి



లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తిరుపతి

దండేపల్లి: రాష్ట్ర మంత్రివర్యులుగా నియమితులైన ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శనివారం రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి ధర్మపురిలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

చెన్నూర్: చెన్నూర్ పట్టణ సన్నాయి వృత్తి కళాకారుల సంఘం కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి కోమాండ్ల మనోహర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి శంకర్ తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా నగునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జాడి తిరుపతి, ఆసంపల్లి ప్రకాశ్, కార్యదర్శిగా ముంజం రవీందర్, కోశాధికారిగా ముంజం రాజన్న, ప్రచార కార్యదర్శిగా కొటారి తిరుపతి, ముఖ్య సలహాదారులుగా కొడిపల్లి రాజారాం, చెన్నూరి రాజేశ్, ఆయిలాల రమేశ్ ఎన్నికైనట్లు వారు పేర్కొన్నారు.

పెయింటింగ్ పోటీలు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో శనివారం అంతర్జాతీయ మత్తు పదార్థాల నిరోధక దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మత్తు, మాదక ద్రవ్యాల నిర్మూలనే మంచి తరాలకు పునాది అన్నారు. పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్‌యూనిట్–2 ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

వేమనపల్లి: మండలంలోని బుయ్యారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వెంకాగౌడ్ శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొప్పుల చరణ్, మధునయ్య, వెంకటేశ్వర్లు,పాల్గొన్నారు.

వైద్యశిబిరం

కాసిపేట: మండలంలోని ఆదాని గ్రూప్‌కు చెందిన దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్ మేడికవర్ హాస్పిటల్ కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం కంపనీ ఆవరణలో వైద్యశిబిరం నిర్వహించారు. 65 మంది రోగులకు వైద్యపరీక్షలు చేశారు. ప్రముఖ వైద్యుడు వాసుదేవారెడ్డి, డాక్టర్ లోకేష్ రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో యూనిట్ హెడ్ బాల గిరిధర్, అధికారులు డాక్టర్ నవీన్, ఉమాశంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రునికి పరామర్శ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ 3, 3ఏ గనిలో బుధవారం ప్రమాదవశాత్తు గాయపడి రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్‌ను శనివారం టీబీజీకేఎస్ టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఇతర నాయకులు పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపీనాయక్, తీగల వెంకట్‌రెడ్డి, నరేశ్, సాదుల భాస్కర్, వెంగళ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా తిరుపతి



నియామకపత్రం అందుకుంటున్న తిరుపతి

లక్సెట్టిపేట: రైతు సంక్షేమ సేవా సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన దాసరి తిరుపతి వర్మ నియామకమైనట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొగిలి కిరణ్ తెలిపారు. శనివారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియామకపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రహదారులపైనే పారుతున్న మురుగునీరు



కలెక్టరేట్ చౌరస్తా సమీపంలో జాతీయ రహదారిపై మురుగు నీరు



ఫ్లడ్ కాలనీ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై మురుగు నీరు

నస్పూర్: పట్టణ పరిధిలో పలుచోట్ల మురుగునీరు రోడ్లపైనే పారుతున్నా అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని ఫ్లడ్ కాలనీ చౌరస్తా నుంచి తోళ్లవాగు వరకు బేకరీలు, హోటళ్లతో పాటు పలు దుకాణాల నుంచి వెలువడే మురుగునీటిని సంబంధిత యజమానులు నేరుగా జాతీయ రహదారిపైకే వదలుతున్నారు. దీంతో రోడ్డుపైనే మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతుండడంతో వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపై పారకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వరదనీటితో వాహనదారుల ఇక్కట్లు

భీమారం: మండల కేంద్రంలోని మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిపై వరదనీరు పారుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వరదనీరు వెళ్లేందుకు ప్రత్యేకంగా రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించినా అందులోంచి వెళ్లకుండా రోడ్డుపై నుంచే పారుతోంది. దీంతో రోడ్డు ధ్వంసమయ్యే ప్రమాదం కూడా ఉంది. నేషనల్ హైవే అధికారులు స్పందించి వరదనీరు డ్రెయినేజీల గుండా వెళ్లేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



పదవులు కాదు.. ప్రజలే ముఖ్యం



చెన్నూర్‌లో మాట్లాడుతున్న మంత్రి వివేక్



జైపూర్: ఇందారంలో గజమాలతో సత్కారం



రామకృష్ణాపూర్: కార్మికుడి విగ్రహం ఆవిష్కరణ

- పదవులు కోరుకోలేదు.. మా ఇంటికే వచ్చాయి
- మంత్రి వివేక్ వెంకటస్వామి

చెన్నూర్: గడ్డం ఫ్యామిలీ ఏనాడూ పదవులు కోరుకోలేదని, పదవులే మా ఇంటికి వచ్చాయని రాష్ట్ర మైనింగ్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం శనివారం మొదటిసారిగా చెన్నూర్‌కు వచ్చిన మంత్రికి కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. స్థానిక జలాల్ పెట్రోల్ బంక్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు గుస్సాడీ నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో కాకా వెంకటస్వామి త్యాగాలను ప్రజలు మరిచిపోలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నేరవేరుస్తానన్నారు. పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రూ.200 కోట్ల నిధులతో చెన్నూర్ మండలంలోని సోమన్‌పల్లిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, చెన్నూర్, కోటపల్లి మాజీ జెడ్పీటీసీలు కరుణసాగర్‌రావు, పోటు రాంరెడ్డి, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఫయాజ్, నాయకులు నారాయణ, హిమవంతరెడ్డి, శ్రీధర్, బషీరొద్దీన్ పాల్గొన్నారు.

నియోజకవర్గానికి నిధుల వరద..

జైపూర్: చెన్నూర్ నియోజకవర్గంలో నిధుల వరద కురిపిస్తానని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పెద్దపల్లి–మంచిర్యాల జిల్లా సరిహద్దు ప్రాంతమైన ఇందారం గోదావరిబ్రిడ్జి నుంచి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనస్వాగతం పలికారు. ముందుగా గోదావరిబ్రిడ్జిపై గంగమ్మతల్లికి పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి భారీ కాన్వాయ్, బైక్‌ర్యాలీగా సాగిన యాత్ర ఇందారం, రసూల్‌పల్లి, జైపూర్ వద్ద అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. గజమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రెటరీ రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిగా మిమ్మల్ని కలవడం సంతోషంగా ఉంది

భీమారం: మీ ఆశీర్వాదాలతో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు చేపట్టి మీవద్దకు రావడం సంతోషంగా ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. భీమారం మండల కేంద్రానికి వచ్చిన మంత్రికి కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఆవిడం ఎక్స్‌రోడ్డు వద్ద గజమాలతో సత్కరించారు.

జీవో 76 పునరుద్ధరిస్తాం

రామకృష్ణాపూర్: వివిధ కారణాల చేత నిలిచిపోయిన సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ జీవో 76ను పునరుద్ధరిస్తామని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఏరియా ఆసుపత్రి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సింగరేణి కార్మికుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం బీజోన్ నుండి సూపర్‌బజార్ మీదుగా రామాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్, ఏఐటీయూసీ నేత వాసిరెడ్డి సీతారామయ్య, కాంగ్రెస్ నాయకులు పల్లె రాజు, రఘునాథ్‌రెడ్డి, వొడ్నాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో తులాభారం

మందమర్రిరూరల్: మందమర్రికి విచ్చేసిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మందమర్రిలో ఘనస్వాగతం పలికారు. అనంతరం మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ ప్రజలు నమ్మకంతో గెలిపించారని, ప్రజల రుణం ఏనాటికీ మరువలేదని అన్నారు. పాత బస్టాండ్ ఏరియాలో తులాభారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డీజీఎం బాధ్యతల స్వీకరణ



ఎస్.అనిల్‌కుమార్

శ్రీరాంపూర్: ఆర్జీ–2 ఏరియా నుంచి శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్)గా బదిలీపై వచ్చిన ఎస్.అనిల్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జీఎం కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం ఎస్.సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్సా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇందారం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అధికారి కేవీ రెడ్డి, డీజీఎం(ఐఈడీ) రాజన్న డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, ఏరియా రక్షణాధికారి అజయ్ కుమార్, సర్వే అధికారి నర్సింగరావు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీలో పలువురి చేరిక



ఐఎన్టీయూసీలో చేరిన వారితో జనక్‌ప్రసాద్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీకి చెందిన పలువురు ఏఐటీయూసీ నాయకులు ఆర్నకొండ అంజనేయులు ఆధ్వర్యంలో శనివారం ఐఎన్టీయూసీలో చేరారు. ఏరియాలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ హాజరై కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి పరిరక్షణ, కార్మిక సమస్యల పరిష్కారం ఐఎన్టీయూసీతోనే సాధ్యమన్నారు. రాబోయే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు నరేందర్, సూర్యనారాయణ, యేకుల సత్యం, సాంబయ్య, శ్రీనివాస్‌పాల్గొన్నారు.

'ఆశ్రమ' భూమి ఆన్‌లైన్ చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

వేమనపల్లి: వేమనపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన భూమిని భూ భారతి ద్వారా ఆన్‌లైన్ ప్రొసీడింగ్ ఇప్పించాలని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం జ్ఞానేశ్వర్, కొత్తపల్లి, దస్నాపూర్ గ్రామస్తులు శనివారం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. దస్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో 1997లో ఆరెకరాల 25 గుంటల విస్తీర్ణంలో ఆశ్రమ పాఠశాలను నిర్మించామన్నారు. క్రీడా మైదానం కోసం అప్పటి హెచ్ఎం దస్తగిరి అహ్మద్ ఖాన్ సహకారంతో కొత్తపల్లికి చెందిన పోచయ్య వద్ద నుంచి అప్పటి తహసీల్దార్ ఐదెకరాల భూమిని తీసుకుని అతనికి భూమికి బదులు సూరారం శివారులో మరో భూమిని ప్రభుత్వం అప్పగించిందన్నారు. అప్పటి నుంచి భూమి ఆశ్రమ పాఠశాల ఆధీనంలో ఉండగా దస్నాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, పడమర వైపు ఉన్న భూమిని ఆక్రమించుకుంటూ ప్రహరీ నిర్మాణానికి అడ్డుపడుతున్నారన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల జోక్యంతో ఏడీఎస్ఎల్ఆర్ ఆరు నెలల క్రితం కొలతలు చేసి హద్దులు నిర్ణయించారన్నారు. కానీ పక్కనున్న పట్టాదారు పలుమార్లు ఆక్రమణకు యత్నిస్తున్నారని ఈ విషయమై ఆశ్రమ పాఠశాల భూమికి పట్టా ప్రొసిడింగ్ ఇప్పించి ఆశ్రమ పాఠశాల భూమి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని కోరారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

పాతమంచిర్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సమావేశంలో తాము అధికారంలోకి వస్తే బీసీలకు ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డి (6) ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌లు పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండగా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు తులా మధుసూధన్, కర్రె లచ్చన్న, భీమ్‌సేన్, గజెల్లి వెంకటయ్య, నెన్నెల నర్సయ్య, భిక్షపతి, అంజన్న, అశోక్, గుమ్ముల లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణానికి సహకరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంపత్ కుమార్

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి శివారులో నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయ ప్రహరీ నిర్మాణానికి అధికారులు సహకరించాలని కోరుతూ బీజేపీ మండలాధ్యక్షుడు సూరం సంపత్ శనివారం తహసీల్దార్ భోజన్నకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా అధికారుల నుంచి ఆంక్షలు వస్తున్నాయని, పనులు నిలిపి వేయిస్తున్నారన్నారు. ప్రహరీ లేకపోతే పశువులు సంచరించడం, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు బోయిని తిరుపతి, నాయకులు దేవునూరి సంతోష్, అనిల్, బాలాజీ, ఆర్ఎస్ఎస్ పోశం, రేషవేణి స్వామి, బోయిని రాములు, రేషవేణి మల్లయ్య, బాపు, మారం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతాం



మాట్లాడుతున్న బసవ పున్నయ్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరంపోరాటం చేస్తామని జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. శనివారం మంచిర్యాల గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన జర్నలిస్టు ఫెడరేషన్ మూడో జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల కనీస సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. నూతన సంవత్సరం ఆరంభమై ఆరు మాసాలు గడిచినా అక్రిడిటేషన్ కార్డులపై ఇంకా స్టిక్కర్లు వేస్తూ కాలం వెల్లదీస్తున్నారన్నారు. హెల్త్ కార్డులు ఇచ్చామని చెబుతున్నా అవిఎక్కడా పని చేయడం లేదన్నారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక..

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా తోట మల్లేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చింతకింది మధుసూదన్, ఉపాధ్యక్షులుగా చంచు చందు, అరికిల్ల జీవన్ బాబు, గొర్రె లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శులుగా బుద్దె రవికుమార్, ఇప్ప రాజ్‌కుమార్, కోశాధికారిగా క్యాతం రాజేశ్, జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ముత్యం వెంకటస్వామి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా గోపతి సత్తయ్య, మేకల ప్రభాకర్, ఆవిడపు వెంకటేశ్, సభ్యులుగా ఎం.శేఖర్, జాడి వెంకటయ్య, నేరెళ్ల సంతోశ్‌గౌడ్, కే.రామాచారిని ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట శివారులో గత నెల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న రుద్రోజు ప్రణయ్‌సాగర్ (33) శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్‌కు చెందిన ప్రణయ్‌సాగర్ గత నెల 22న మినీ ట్రాక్టర్‌పై వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడడంతో తీవ్రగాయాలుకాగా హైదరాబాద్‌కు తరలించారు.

నలుగురిపై కేసు

దండేపల్లి: మండలంలోని కొండాపూర్‌లో భూవివాదంలో బారతపు సత్తవ్వ, ఆమె మరిది ప్రభాకర్‌పై అదే గ్రామానికి చెందిన బారతపు కుమారస్వామి, లింగయ్య, అమృత, గంగాలక్ష్మి శనివారం ఇనుపరాడ్డు, గొడ్డలితో దాడి చేసి గాయపరిచారు. దీంతో సత్తవ్వ ఫిర్యాదు మేరకు కుమారస్వామి, లింగయ్య, అమృత, గంగాలక్ష్మిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తహసినొద్దీన్ తెలిపారు.

'కంపెనీలో రాజకీయ జోక్యంతో ఇబ్బందులు'

కాసిపేట: కంపెనీలో రాజకీయ జోక్యం పెరగడంతో సంస్థకు, కార్మికులకు ఇబ్బందిగా మారుతోందని ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ అన్నారు. శనివారం కాసిపేట 1గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రెటరీ మినుగు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ పార్వతి సురేష్, వైస్ ప్రెసిడెంట్ చొప్పరి శ్రీహరి, సంతోష్, రంజిత్, అశోక్, నాగేశ్వరరావు, బెల్లం శ్రీనివాస్, రవీందర్, శ్రీనివాస్, తిరుపతి, జాడి శంకర్, రఘురాం పాల్గొన్నారు.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ



కుషీంద్ర వర్మ



నూనె శ్రీజన్

లక్సెట్టిపేట: నీట్ ఫలితాల్లో మండలంలోని బలరావుపేట గ్రామానికి చెందిన కందుల కుషీంద్రవర్మ ఆలిండియాలో 1,360 ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 426వ ర్యాంకు సాధించాడు. సదరు విద్యార్థి పదోతరగతి వరకు పట్టణంలోని గుడ్ షెప్పర్డ్ పాఠశాల, ఇంటర్ చైతన్య కళాశాలలో చదివాడు. తండ్రి ప్రవీణ్‌కుమార్ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడు కాగా తల్లి సుమలత గృహిణి. పట్టణానికి చెందిన నూనె శ్రీజన్ నీట్‌లో ఆలిండియాలో 1,32,832 ర్యాంకు సాధించాడు.

తాగునీరు సరఫరా చేయాలని రాస్తారోకో

తాండూర్: రోజువారీగా తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తాండూర్ మేజర్ గ్రామ పంచాయతీలోని మేదరివాడ మహిళలు తాండూర్– భీమిని రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అరగంటకుపైగా సాగిన రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ వరుసగా నాలుగు రోజుల నుంచి తాగునీటి సరఫరాలేదన్నారు. వెంటనే నీటి సరఫరా పునరుద్ధరించాలని లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడగా రెండు మూడు రోజుల్లో తాగునీటి సరఫరా మెరుగుపరుస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డు వేశారు.. మొరం మరిచారు

నెన్నెల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సీసీరోడ్ల అంచులకు (సైడ్ బర్మ్) మట్టి పోయడం మరిచారు. దీంతో ఎదురుగా వాహనాలు వస్తే రోడ్డు దిగేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్నిసార్లు ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డుకు ఇరువైపులా మట్టి పోసేలా చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి:
మహేందర్, పంచాయతీరాజ్ ఏఈ,
సెల్ నం.9493840350



కొండువాడలో వేసిన సీసీ రోడ్డు